క్లుప్తంగా

బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికైన ఏజీవర్సిటీ విద్యార్థులు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్లుగా ఎంపికయ్యారు. గత వారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు ఉద్యాన విశ్వవిద్యాలయంలో క్యాంపస్ సెలక్షన్ నిర్వహించారు. ఇందులో 150 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 56 మంది విద్యార్థులు అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్స్‌గా ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియెట్ డీన్ చీనా నాయక్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది సాయికృష్ణ ,నిఖిల్, అశ్విన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు



మాట్లాడుతున్న వీసీ

రాయదుర్గం: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్‌లో బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌ను మంగళవారం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువకులు శరీర ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం అనే రెండు అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.అందరూ బీఎల్ఎస్, ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌లో అపోలో ఆస్పత్రి డాక్టర్ అహ్మద్ అలీ, డాక్టర్ యాజిత అవగాహన కల్పించడంతోపాటు పలు సూచనలు చేశారు. హెచ్‌సీయూలోని ఉద్యోగుల పిల్లల కోసం ఈ సెషన్‌ను ప్రత్యేకంగా నిర్వహించారు. వారిలో దాదాపు 40 మందికి బీఎల్ఎస్, ప్రథమ చికిత్స శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అపోలో వైద్య బృందం, హెచ్‌సీయూ అధికారులు పాల్గొన్నారు.


అవోపా కార్యదర్శికి నంది అవార్డు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర అవోపా కార్యదర్శి, సంఘసేవకుడు సంబు వెంకటరమణ, ఆయన సతీమణి సంబు శోభకు నంది అవార్డు అందజేసి సత్కరించారు. కొన్ని సంవత్సరాలుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంబు వెంకటరమణ, శోభలకు జీసీఎస్ ఒల్లూరి ఫౌండేషన్ వారు రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు బహూకరించారు. ఏసీపీ రాందాస్ తేజ, సద్గురు దైవజ్ఞ శర్మ వారికి నంది అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంబు వెంకటరమణ, శోభ మాట్లాడుతూ.. కరోనా కాలంలో సైతం అడవులలో చెంచులకు సేవలు చేయడం, కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవలకు నంది అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని యువకుడి మృతి

రాజేంద్రనగర్: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ ఫయాజ్(35) అనే యువకుడు అత్తాపూర్‌లో తన సోదరి వద్ద ఉంటున్నాడు. ఇటీవల అతని సోదరుడు మృతి చెందటంతో మానసిక ఆందోళనతో జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లాడు.కాగా ఆరాంఘర్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొనటంతో మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



రాజేంద్రనగర్: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...హైదర్‌గూడ నుంచి లంగర్‌హౌస్ వెళుతున్న వంతెన వైపు వెళ్లే రహదారి పక్కన ఓ మహిళ మృతదేహం ఉందని మంగళవారం పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆమె (40) అప్పటికే మృతి చెంది ఉంది. స్థానికంగా బిక్షాటన చేస్తు జీవిస్తుండేదని స్థానికులు తెలిపారు. పంచనామా నిర్వహించి పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్టు వెల్లడించారు.



నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో పచ్చడి మామిడి కాయల షాపులు



మామిడి కాయలు కట్ చేస్తున్న దృశ్యం

పచ్చడి పెట్టేదెలా..?

- మార్కెట్‌లో మండిపోతున్న మామిడికాయల ధరలు.. రూ. 15 నుంచి 40
- మరికొన్ని రకాలు ఏకంగా రూ.80పైమాటే
- పెరిగిన నూనె, కారం ధరలు
- పచ్చడికాయలకు కేరాఫ్ అడ్రస్‌గా నల్లగండ్ల, తారానగర్ మార్కెట్లు

శేరిలింగంపల్లి: 'వేడి వేడి అన్నంలో ఆవకాయ తింటే ఆ రుచే వేరులే' అనే మాట ప్రతి ఒక్కరి నోటి నుంచి వెలువడే మాట. వేసవి వచ్చిందంటే ఇళ్లల్లో మామిడికాయ పచ్చడి పట్టినట్టే. ఐతే ఈ ఏడాది మామిడికాయలు, నూనె, ఎండుమిర్చి రేట్లు పెరగడంతో ఆవకాయ పచ్చడికి ధరల సెగ తగులుతోంది. ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల, తారానగర్ మార్కెట్‌లలో పచ్చడి మామిడికాయల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ ఏడాది అకాల వర్షాలు, ఈదురు గాలులతో కాయల దిగుబడి తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. నల్లగండ్ల, తారానగర్ మార్కెట్‌లకు బాటసింగారం, బోయిన్‌పల్లి నుంచి వివిధ రకాల కాయలు తీసుకువచ్చి అమ్ముతుంటారు.

అమ్మో ఇవేం ధరలు

మార్కెట్‌లో మామిడికాయల ధర అడిగిన కొనుగోలుదారులు 'వామ్మో....ఇంత రేటా అని అంటున్నారు. పచ్చడి మామిడి కాయల ధరలు చూసి బెంబేలెత్తే పరిస్థితి నెలకొంది. కాయ సైజ్‌ను బట్టి రూ.15–40 వరకు పలుకుతుండగా జలాలు రూ. 60, బెల్ల పచ్చడి కాయలు ఒక్కోటి రూ. 60–80 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక అదే దారిలో నూనెలు, కారం, మసాలాలు కూడా పెరిగాయి.

కేరాఫ్ అడ్రస్‌గా..

- నల్లగండ్ల, తారానగర్ మార్కెట్లు పచ్చడి మామిడి కాయలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.
- ఇక్కడ ప్రధానంగా తెల్ల గులాబీలు, నాటు కాయలు, సువర్ణరేఖ, దేశవాళీ, జలాలు, ఆంధ్రా తెల్లగులాబీలు, రసాలు దొరుకుతాయి.
- పచ్చడి కాయ సైజును బట్టి రూ.15 ,20, 30 ,35, 40 చొప్పున విక్రయిస్తున్నారు. జలాలు ఒకటి రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. బెల్లం పచ్చడి కాయలు రూ. 60,70,80 చొప్పున విక్రయిస్తున్నారు.
- కాయ సైజ్‌ను బట్టి 4,5,6 చొప్పున ముక్కలు కట్ చేసినందుకు తీసుకుంటున్నారు.

సెలవు రోజుల్లోనే వ్యాపారం బాగు..



పచ్చడి మామిడి కాయల ధరలు బాగా ఉన్నాయి. అకాల గాలి వానలతో పది రోజుల్లోనే కాయల ధరలు బాగా పెరిగిపోయాయి. మార్కెట్‌కు వచ్చే పచ్చడి కాయలు తగ్గడంతో ధరలు పెరిగాయి. బాటసింగారం మార్కెట్ నుంచి ఎప్పటికప్పుడు తాజా కాయలు తీసుకువస్తున్నాం. కాయలు కొనడానికి బాగానే వస్తున్నారు. సెలవు రోజుల్లో వ్యాపారం బాగా సాగుతుంది.

–యశోద, మామిడి కాయల వ్యాపారి, నల్లగండ్ల

మండుటెండ.. వాహనదారులు విలవిల



బయోడైవర్సిటీ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ఒక వైపు ట్రాఫిక్ జామ్.. మరోవైపు భానుడి ప్రతాపంతో వాహనదారులు విలవిలలాడారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకొని నానా ఇబ్బందులకు గురయ్యారు. ఐకియా గేట్ నంబర్–1, మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ జంక్షన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాలుగు దిక్కులా ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు మూడు గంటలపాటు చర్యలు తీసుకున్నా ఓ కొలిక్కిరాలేదు. అటు పోలీసులు, ఇటు వాహనదారులు నరకయాతన అనుభవించారు.

శుభకార్యానికి వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల

రాజేంద్రనగర్: బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యానికి వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్‌లైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బిస్మిల్లా హోటల్ ప్రాంతానికి చెందిన షహనాజ్ బేగం తన కుటుంబ సభ్యులతో సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లింది. తిరిగి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఇంటికి చేరుకుంది. ఇంటి తాళాలు పగల కొట్టి ఉండటం, బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 14 వేల నగదు, టీవీ, ఇతర గృహోపకరణాలు కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



పరీక్ష చేయించుకుంటున్న మంత్రి తలసాని, ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: ఆరోగ్య తెలంగాణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యకర జీవితం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని అబిడ్స్ నేతాజీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానాలతో ప్రజలకు ఇంటివద్దకే వైద్యం అందిస్తున్నామన్నారు. అన్ని బస్తీలు, మురికివాడల్లో వారికి అనుకూలంగా ఉండే విధంగా బస్తీ దవాఖానా ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన వైద్య అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట్, కార్పొరేటర్లు డాక్టర్ సురేఖ ఓంప్రకాష్, బీఆర్ఎస్ నేతలు గడ్డం శ్రీనివాస్ యాదవ్, మమతా గుప్తా, సంతోష్‌గుప్తా, ఆనంద్‌కుమార్ గౌడ్, ధన్‌రాజ్, ఆర్‌వి.మహేందర్‌కుమార్, సురేష్ ముదిరాజ్, భీశ్వ ఓంప్రకాష్, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుభాన్‌పురాలో బస్తీ దవాఖానా ప్రారంభం..

జాంబాగ్ సుభాన్‌పురాలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన మరో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. జాంబాగ్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ సుభాన్‌పురా బస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు గత సంవత్సర కాలంగా మంత్రి సహకారంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఈ బస్తీ దవాఖానా ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. సుభాన్‌పురా, ఆగాపురా, దర్గాయేకామూష్ ప్రాంతాల ప్రజలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు. మంత్రి తలసానిని, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను ఆనంద్‌కుమార్ గౌడ్ గజమాలతో సత్కరించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్

అబిడ్స్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజ్ పేర్కొన్నారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉంటేనే వాహనాలు నడపాలన్నారు. రహదారులపై క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బందికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలకు కొంతమంది వాహనదారులు భయపడి ప్రమాదాలు తెచ్చుకుంటున్నారన్నారు. ఎలాంటి సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ తోనే పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు సిబ్బందికి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ అకడమిక్ ఫర్ స్కిల్స్ సెంట్రల్ హెడ్ సిమోన్, ఫ్యాకల్టీ రజినీకాంత్‌రెడ్డి, దేవరాణి, ట్రాఫిక్ ఎస్ఐ జ్యోతి, చక్రధర్, నరేందర్ పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ముఖ్య సమావేశం



సుల్తాన్‌బజార్: భారతదేశంలో 29 రాష్ట్రాల్లో ఎక్కడా ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అర్చక ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రాంటిన్ ఎయిడ్ ద్వారా జీతాలు అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. ఈనెల 17న బొగ్గులకుంటలోని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున అర్చక ఉద్యోగులు కలిసి రావాలని కోరుతూ మంగళవారం రమణాచారి ఆధ్వర్యంలో పరిషత్ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేవాదాయ శాఖలో ఉన్న 5625 మంది అర్చక ఉద్యోగులకు జీఓ నెంబర్–577 ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇస్తూ బ్రాహ్మణులకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. మే 31న ప్రారంభం కానున్న బ్రాహ్మణ భవన్ కార్యక్రమానికి సంబంధించి 17న ఉదయం 10 గంటలకు అన్ని బ్రాహ్మణ, అర్చక దేవాదాయ సంఘాలన్ని పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు, జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, అధ్యక్షుడు బద్రీనాథ చార్యులు, ఉద్యోగ సంఘం అధ్యక్షులు కాండూరి కృష్ణమాచార్యులు, చంద్రశేఖర శర్మ, ఇతర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు ఎనలేనివి

సుల్తాన్‌బజార్: నర్సుల సేవలు ఎనలేనివని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షురాలు శశిశ్రీ అన్నారు. మంగళవారం కోఠిలోని సంఘం కార్యాలయంలో ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శశిశ్రీ కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించిన నర్సులలో విధి నిర్వహణలో అమరులైన నర్సుల కుటుంబాలకు గౌరవ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి కోవిడ్ రోగులకు సేవలను అందించన ఘనత నర్సులదే అన్నారు. కొందరు నర్సులు కోవిడ్ బారిన పడితే మరికొందరు కోవిడ్‌తో ప్రాణాలర్పించారన్నారు. వారి సేవలు మరువలేనివని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి టి.విజయనిర్మల, కోశాధికారి స్ఫూర్తి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శీల, కె.పుష్ప, మేరీ మార్గరేట్, లావణ్య, లక్ష్మి, కళావతి, ప్రశాంతి పాల్గొన్నారు.



నర్సులను సన్మానిస్తున్న శశిశ్రీ, విజయనిర్మల తదితరులు

శిశు మందిరాల నూతన ఆచార్యులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి ఉమ

బండ్లగూడ: శ్రీ సరస్వతి శిశు మందిరాలు విద్యారంగంలో చేస్తున్న కృషి ప్రశంసనీయమని ప్రముఖ సామాజిక కార్యకర్త, విద్యావేత్త శ్రీమతి కొత్తపల్లి ఉమ అన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీ శారదాధామంలో శిశు మందిరాల నూతన ఆచార్యుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యారంగంలో కీలకమైన ఉపాధ్యాయులకు చక్కటి శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందన్నారు. ఆచార్యులకు అన్ని విషయములలో ప్రయోగాత్మక శిక్షణ ఇస్తూ గురుకుల పద్ధతిలో అన్ని నియమ నిబంధనలు పాటించే విధంగా చూడాలని తెలిపారు. అదే విదంగా వారికి యోగా సంగీతం ,నృత్యము,సామాజిక కార్యక్రమాల్లోనూ శిక్షణ ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యా పీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి మాన్యశ్రీ పతకమూరి శ్రీనివాస్‌రావుగారు, శ్రీ ప్రాంత కార్యదర్శి మాన్యశ్రీ ముక్కాల సీతారాములు, తెలంగాణ అకడమిక్ ఇంచార్జ్ శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఓబీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

రాజేంద్రనగర్: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓబీసీ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని జిల్లా ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటేష్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బొమ్మరాజు నరసింహ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల పట్ల వివక్ష చూపుతుందన్నారు. ఈనెల 18వ తేదీన నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఓబీసీ మోర్చ సమావేశం నిర్వహిస్తుందని, దానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. సత్యనారాయణ ముదిరాజ్, అడికె జనార్దన్, జగన్, హరికృష్ణ, సిద్దేశ్వర్, మల్లేష్ చారి, మోహన్, శ్రీరాం పాల్గొన్నారు.

జేఎన్‌వీ 11వ తరగతిలో ఖాళీల భర్తీకి చర్యలు

- దరఖాస్తుకు ఆఖరు తేదీ మే 31
- ప్రవేశ పరీక్ష జూలై 22న



గోపన్‌పల్లిలోని జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రధాన భవనం

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)లో 2023–24 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నారు. జేఎన్‌వీ చరిత్రలో మొదటిసారిగా 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోగా పంపాలి. నిన్నటిదాకా పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఖాళీ సీట్లు ఉంటే 11వ తరగతిలో భర్తీ చేసేవారు. అయితే ఎంపికలో మరింత పారదర్శకత పాటించేందుకే ప్రవేశపరీక్ష పెడుతున్నారు.

- 2006 జూన్1వ తేదీ నుంచి జూలై 31, 2008 మధ్య జన్మించినవారు 2022–23 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన వారు అర్హులు. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఓఎంఆర్ బేస్డ్ ఆబ్జెక్టివ్ టైప్ తరహాలో ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది. ప్రవేశ పరీక్ష జూలై 22వ తేదీన నిర్వహిస్తారు.

అధ్వానంగా మంచిరేవుల రోడ్డు



మణికొండ: గ్రామంలో ప్రధాన రోడ్డు. జలమండలి, ఇతర కేబుల్ పనుల కోసం తవ్విన తవ్వకాలతో అడుగుకో గుంతగా మారింది. దీనికితోడు అక్కడక్కడా లీకేజీలు ఏర్పడటంతో రోడ్డు జలమయం అయ్యింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల ప్రధాన రోడ్డు దుస్థితికి చేరినా పట్టించుకునే నాథుడే లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డు పాడైనా నెలల తరబడి పట్టించుకోకపోవటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు ,అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి



మృతిచెందిన రమేష్

శంషాబాద్: మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం షాద్‌నగర్ పట్టణానికి చెందిన రమేష్, సుజాత దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్ కుమార్ వద్ద పనిచేస్తున్న రమేష్ పట్టణంలోని రిజిస్టేషన్ కార్యాలయం సమీపంలోని శ్రీనివాస్ కాలనీలో నీలం రాజు అనే యజమానికి సంబంధించిన నాలుగు అంతస్థుల భవనంలో సెంట్రింగ్ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సెంట్రింగ్ కాంట్రాక్టర్ కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు భార్య సుజాత ఘటనా స్థలానికి చేరుకుంది. అప్పటికే రమేష్ నాల్గో అంతస్థు నుంచి కిందపడి మృతిచెంది ఉన్నాడు. యజమానితో పాటు మేస్త్రీల నిర్లక్ష్యంతోనే నాల్గో అంతస్తుపై నుంచి రమేష్ మృతిచెందినట్లు సహచర కార్మికులతో పాటు అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రికి రెండు వారాలుగా రోగుల తాకిడి పెరిగింది. ఉదయం 7 నుంచే ఆస్పత్రి ఓపి వద్ద రోగులు క్యూ కడుతున్నారు. సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ఎక్కువగా వస్తున్నారు. జ్వరంతో బాధపడే వారితో పాటు ఒంటి నొప్పులు ఉన్న వారికి వ్యాధి నిర్ధారణపరీక్షలు నిర్వహిస్తున్నామని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. ఆస్పత్రిలో ఎక్కువ మందికి మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణ అవుతుందని తెలిపారు.

పెళ్లి కావటం లేదని యువకుని ఆత్మహత్య

మణికొండ: తనకు పెళ్లి కావటం లేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...టోలిచౌకిలోని హరిజన బస్తీలో ఉంటున్న డి. బాలాజీ, డి. భార్గవ్(23)లు అన్నదమ్ములు. వీరు పుప్పాలగూడ, సెక్రటేరియట్ కాలనీలోని ఉమేష్‌సింగ్ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి 9గంటలకు భోజనం చేసిన భార్గవ్ టెంట్‌హౌస్ గోడౌన్‌కు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడ పనిచేసే రాజేశ్ మంగళవారం ఉదయం టెంట్‌హౌస్‌కు వచ్చి గోడవున్ షటర్ ఎత్తేందుకు ప్రయత్నిస్తే రాలేదు. విషయాన్ని టెంట్‌హౌస్ యజమానికి తెలిపగా అతను వచ్చి ఇద్దరు కలిసి షటర్‌ను బలవంతంగా తెరిచారు. భార్గవ్ రాడ్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుని సోదరుడు బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.